పేరుతో ఆ వ్యక్తి చేసిన మోసాల వివరాలు పంపించండి. మన స్పెషల్ బ్రాంచ్‌లోని మెరికల్లాంటి వారిని నలుగురయిదుగురిని ఓ టీమ్‌గా ఏర్పాటు చేసి ఈ వ్యక్తిని వాళ్ళు అరెస్ట్ చేసేదాకా ఇదే పని మీద వుండేలా చూడాలి. ఐ.విల్ స్పీక్ టు స్పెషల్ బ్రాంచ్ డి.ఐ.జి చెప్పాడు డి.జి.పి.

విషకంఠం అనే ఆ వ్యక్తికి తన మీద ఆంధ్రప్రదేశ్ డి.జి.పి. తీసుకున్న ఆ నిర్ణయం గురించి తెలీదు.

ఇప్పుడాయన ఓ గొప్ప పథకానికి రూపు దిద్దుతున్నాడు. అది విజయవంతం అయితే గ్రేటెస్ట్ స్విండిల్, ఆఫ్ ది సెంచరి అయి తీరుతుందది.

(మిగతాది మళ్ళీవారం)

# శ్రీ సరదా కథలు

శ్రీకాంత్ ఆ రోజే డాట్సన్ కారు కొన్నాడు. సంవత్సరానికో కారు కొనడం, పాతది అమ్మేయడం అతని అలవాటు. ఏ వెహికిల్ నైనా అత్యద్భుతంగా నడపగల సమర్థుడతను. అంతే కాక అతడికి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉంది. అదీగాక రకరకాల వాహనాల రేస్‌లలో ఎన్నోసార్లు ప్రథమ బహుమతిని పొందిన చరిత్ర కూడా ఉంది.




## సవాల్

కొత్త కారులో ఖుషీగా విలాసంగా డ్రైవ్ చేసుకొంటూ పోతున్న శ్రీకాంత్‌కి పక్కనుండి ఎవరో మాట్లాడినట్టయింది. తుళ్ళిపడి చూశాడతను. హీరో హోండా మోటార్ సైకిల్ మీద తనను దాటుకుంటూ వెళ్ళిపోయాడో కుర్రాడు...

వెంటనే స్పీడు పెంచి అతన్ని చేరుకొని పక్కగా పోనిస్తూ "వ్వాట్?" అని అడిగాడు.

"హీరో హోండా సంగతి తెలుసా మీకు?" అన్నాడా కుర్రాడు. అనడమే తడవుగా మరింత స్పీడుగా ముందుకిపోయి చేతులూపేడు రమ్మన్నట్టు.

శ్రీకాంత్‌కి ఒళ్ళు మండింది ఒక్కసారిగా. ఎన్నో రేసుల్లో ఘనవిజయం సాధించిన తననే వెక్కిరించాలని చూస్తాడా ఆ కుర్రకుంక!? తన ఫోటో ఎన్నోసార్లు పేపర్లో పడింది కనుక వాడు తనని గుర్తుపట్టి కావాలనీ అల్లరి చేస్తున్నట్టుంది.

'సరే చూద్దాం' అనుకుని స్పీడు విపరీతంగా పెంచి తిరిగి అతడ్ని చేరుకున్నాడు శ్రీకాంత్— "ఏమిటి నువ్వంటున్నది?" అని గట్టిగా అరిచాడు తల బైటికి పెట్టి.

"అసలు మీకు హీరో హోండా సంగతి తెలుసా అని అడుగుతున్నాను" అన్నాడా కుర్రాడు అంతకన్నా గట్టిగా. అలా అనడమే తడవుగా జెట్ స్పీడ్‌లో మళ్ళీ తనని దాటుకుంటూ చాలా ముందుకిపోయి రమ్మన్నట్టు చేతులూపేడు మళ్ళీ!

అరికాలిమంట నెత్తికెక్కింది శ్రీకాంత్‌కి. 'ఈ పిల్లకాకా తనని వెక్కిరించేది? ఇక లాభం లేదు తను విజృంభించాల్సిందే' అనుకుంటూ మాగ్జిమమ్ స్పీడ్‌లో ఆ హీరో హోండా కుర్రాణ్ణి దాటుకుంటూ వెళ్తూ— "ఇంకెప్పుడూ నాతో సవాల్ చెయ్యకు" అన్నాడు తల వెనక్కి తిప్పి.

రెండు నిముషాలు గడిచాయి. చాలాదూరం వచ్చేశాడు శ్రీకాంత్. కారుని ఆపి వెనక్కి చూశాడు. ఆ కుర్రాడి జాడలేదు. ఎలాగూ ఇహ ఇంటికి వెళ్ళక తప్పదు కదా అనుకొంటూ తిరుగు ప్రయాణం పట్టాడు. "ఈ వెధవ మూలంగా ఇవాళ అనవసరంగా బోలెడు పెట్రోలు వేస్టయిపోయింది" అని తిట్టుకున్నాడు రెండుసార్లు. వస్తున్న త్రోవలో— ఏ పార్టుకాపార్టు ఊడిపోయి ఉన్న హీరో హోండా, ఆ పక్కనే నిలబడి వెళ్తున్న ప్రతి కారునీ ఆపమని సౌంజ్ఞ చేస్తున్న ఆ కుర్రాడూ కనిపించారు.

అతని పక్కగా కారు ఆపి "గెట్ఇన్" అన్నాడు శ్రీకాంత్.

"హమ్మయ్య... థాంక్యూసార్" అంటూ లోపలకి వచ్చి కూర్చున్నాడా కుర్రాడు.

"ఈమాత్రం దానికేనా అన్నిసార్లు సవాల్ చేశావ్?" అడిగాడు శ్రీకాంత్ విజయ గర్వంతో.

"సవాలెక్కడ చేశానండీ అడుగుతుంటేనూ?" అన్నాడాకుర్రాడు బిత్తరపోతూ.

"అడగటమా?"

"అవునండీ... ఇవాళే కొన్నానండీ ఆ హీరో హోండా! దాని బ్రేకు ఎక్కడో స్పీడు ఎలా కంట్రోల్ చేయాలో అసలు తెలీదు. అందుకే డ్రైవ్ చేస్తూ వస్తున్న ప్రతివాణ్ణీ— 'హీరో హోండా సంగతి తెలుసా మీకు' అని అడుక్కుంటూ వస్తున్నాను. ఎవరైనా చెప్పకపోతారా అని. దాన్ని మీరు సవాల్ అనుకుంటే సారీసార్" అని ముగించాడా కుర్రాడు.